ఆరోగ్యమే లక్ష్యం

- పౌష్టికాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి



తెర్లాం: కూనాయవలస అంగన్‌వాడీ కేంద్రం–2లో పౌష్టికాహార ప్రదర్శన



తెర్లాం: రంగప్పవలసలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఉషారాణి



రామభద్రపురం: సోంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు

రామభద్రపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సోంపురం, రామభద్రపురం గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పౌష్టికాహార మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనత తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉంగరాడ, ఉంగరాడమెట్ట, వన్నలి, ఉప్పర్నాయుడువలస, కేఎం వలస, వండానపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ నూకాలమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకుంటే



రేగిడి: ఉంగరాడ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నూకాలమ్మ

మంచి ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని, ప్రతీ తల్లి ఆరోగ్యానికి మెరుగైన ఆహార విధానం అవలంబించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.శైలజ, పుణ్యవతి, యు.చంద్రకళ, జయలక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని రంగప్పవలస, కూనాయవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రంగప్పవలసలో జరిగిన కార్యక్రమానికి తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, కూనాయవలస–2 అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి హాజరై, పౌష్టికాహారం, దాని ప్రయోజనాలను వివరించారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



సమావేశమైన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాజాం సిటీ: కృష్ణా నది వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమావేశం మంగళవారం జరిగింది. వరదల్లో చిక్కుకుని ఎంతోమంది బిక్కుబిక్కుమని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారని, అటువంటి వారికి సాయం చేసేందుకు మనవంతు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్, మానవతా సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్య, రోటరీక్లబ్ సభ్యులు మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, దాసరి సురేష్, దామోర రాజ, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, వరద బాధితుల సహాయార్థం రాజాం ప్రాంతీయ ప్రెస్‌క్లబ్ సభ్యులు పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించి, సేకరించిన మొత్తాన్ని సీఎం చంద్రబాబునాయుడుకు అందజేస్తామన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

తెర్లాం: వినాయక చవితి పండగ సందర్భంగా గ్రామాల్లో మండపాలు, విగ్రహాల ఏర్పాట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో వినాయక విగ్రహాల ఏర్పాటు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన గ్రామస్తులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. మండపాలు, విగ్రహాల ఎత్తు, ఎన్ని రోజుల పాటు కార్యక్రమం చేస్తారు.. నిమజ్జనం తేదీలను తెలపాలన్నారు. సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో వచ్చే అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఎవరైనా ఫోన్ చేసి మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చెప్పండి అని అడిగినా చెప్పవద్దన్నారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు



రాజయ్యపేట గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించవద్దని, వాహనాలను వేగంగా నడపవద్దని, ద్విచక్ర వాహన చోదకులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట తెర్లాం ఎస్‌ఐ సాగర్‌బాబు తదితరులు ఉన్నారు.

పరామర్శ



సూరిసత్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తలే రాజేష్

రాజాం సిటీ: మండలంలోని నందబలగ పంచాయతీ, లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తాడ్డి గోపాలకృష్ణను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం పరామర్శించారు. గోపాలకృష్ణ అన్నయ్య సూరిసత్యం ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకుని ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీపరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ పాల్గొన్నారు.

సన్మానం

బొబ్బిలి: పాతబొబ్బిలి పెట్రోలుబంకు సమీపంలోని రోడ్డుపై గుంతలను పూడ్చినందుకుగాను గాంధీ స్మారక నిధి ప్రతినిధులంతా కలిసి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్‌లను మంగళవారం సన్మానించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను అందించి, మట్టి ప్రతిమలను పూజిద్దామని ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మింది విజయమోహన్‌రావు, కమల్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

తెగుళ్లు సోకకుండా చూసుకోండి

రేగిడి: పంటలకు తెగుళ్లు సోకకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని అంబకండి, ఉంగరాడ, వన్నలి తదితర గ్రామాల్లోని వరిపంటకు ఆకుముడత తెగులు సోకడాన్ని ఆయన మంగళవారం గమనించి, నివారణకు పలు సూచనలు చేశారు. ఈ తెగులు నుంచి పంటను రక్షించడానికి 200 లీటర్ల నీటిలో 400 మిల్లీలీటర్ల క్లోరో ఫైరిపోస్ మందును కలిపి ఎకరాకు 10 ట్యాంకుల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. నత్రజని ఎరువుల అధిక వినియోగం కారణంగా పంటకు ఈ తెగులు సోకుతోందన్నారు. అన్నదాతలు అప్రమత్తంగా ఉండి, పంటలు సంరక్షించుకోవాలన్నారు.

పదోన్నతి

రాజాం సిటీ: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యుడు నూర్తి కల్యాణ్‌బాబుకు పదోన్నతి లభించినట్లు సూపరింటెండెంట్ కరణం హరిబాబు తెలిపారు. పూర్తి అదనపు బాధ్యతలతో శ్రీకాకుళం డీసీహెచ్‌ఎస్‌గా ఆయనను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. అలాగే మరో వైద్యురాలు జీవీ రాజ్యలక్ష్మి విజయనగరం డీసీహెచ్‌ఎస్‌గా నియమితులయ్యారన్నారు. వారిరువురికీ సూపరిడెంటెండ్ సహా ఆస్పత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ కె.గోపాల్‌దాస్, ఏవో కె.చంద్రశేఖర్, వైద్యులు అభినందనలు తెలిపారు.

క్లోరినేషన్

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం, కృష్ణాపురం గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు మంగళవారం చేపట్టారు. ఎంపీడీవో పి.రవికుమార్ మాట్లాడుతూ పారిశుధ్య చర్యల్లో భాగంగా పరిశుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతీ వీధి స్వచ్ఛంగా ఉండేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భాస్కరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని కోరాడ, పాకీ, స్వామి వారి వీధుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. ప్రతీ వీధి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. మురుగుకాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై పశువులు కడుతున్న వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. మల్లమ్మదేవి పార్కు చెరువు గట్టుపై మొక్కలు నాటాలని తెలిపారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్ అధికారి, తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

రామభద్రపురం: భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తారాపురం ఎంపీటీసీ ప్రతినిధి బెవర చిన్నారావు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు మంగళవారం తహసీల్దారు సులోచనరాణికి వినతిపత్రం అందజేశారు. సాలూరు రూట్‌లో ఉన్న సుగర్ ఫ్యాక్టరీ వద్ద గ్రామానికి చెందిన దేవుడి భూమి ఉందని, ఆ భూమిని పలువురు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆ భూమి ఆక్రమణ జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, డి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకురావాలి

సంతకవిటి: నేత్ర దానానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు యు.నాగేంద్రప్రసాద్, బి.సౌమ్య కోరారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. అన్ని దానాలలో కన్నా నేత్రదానం చాలా గొప్పదని, మనమిచ్చే నేత్రాలు మరో ఇద్దరికి చూపును ప్రసాదిస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. నేత్రదానంపై ఉన్న అపోహలు విడనాడాలన్నారు. మరణానంతరం ఆరు గంటల్లోగా నేత్రదానం చేయాలన్నారు.

రాజాం సిటీ: గ్రామాల్లోని ప్రజలకు నేత్రదానం ఆవశ్యకతను తెలియజేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. పట్టణ పరిధిలోని ఆదర్శనగర్ యూపీహెచ్‌సీలో ఆశ డే సందర్భంగా నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేత్రదానంపై నెలకొన్న అపోహల కారణంగా నేత్రదానానికి ఎవరూ అంతగా రాకపోవడంతో అంధులకు చూపును ప్రసాదించలేకపోతున్నామన్నారు. నేత్రదానానికి అందరూ ముందుకురావాలని కోరారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన ఇందిరమ్మ కాలనీ సచివాలయ ఆరోగ్య కార్యకర్త పి.గౌరిని సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు యు.కిరణ్, అనూష, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

వంగర: మండలంలోని మద్దివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వై.దుర్గారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ విద్యార్థులకు జరుగుతున్న పరీక్షలు, మధ్యాహ్న భోజనం వంటకాలు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకోవచ్చని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.మోహనరావు, ఉపాధ్యాయులు పి.దిలీప్‌కుమార్, వై.వి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లంఊట ధ్వంసం

వంగర: మండలంలోని జేకేగుమ్మడ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న సారాబట్టీలపై పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల బెల్లంఊటను స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా నేరమని, అలా ఎక్కడైనా జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ షేక్ శంకర్ అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని పలు దుకాణాల్లో సచివాలయ వార్డు సిబ్బంది, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు కలిసి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్నదీ.. లేనిదీ పరిశీలించారు. రెండు షాపుల్లో పాలిథిన్ సంచులు విక్రయిస్తున్నట్లు గుర్తించి, ఒక్కో షాపు యజమానికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు.

క్లుప్తంగా

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. బొద్దాంకు చెందిన ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. బొబ్బిలి సెంటర్, మాధవబజార్, అంబేడ్కర్ జంక్షన్, తెలగ, కొండక, కాలెపు వీధుల్లో కృష్ణుడి విగ్రహ ఊరేగింపు ఘనంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేశారు.

పత్రకషాయం తయారీపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పత్ర కషాయం తయారీపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్ మాట్లాడుతూ పత్రకషాయం పిచికారీ చేయడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి కనబరచాలని కోరారు. అనంతరం పత్ర కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి, దాని ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సింహాచలం, వీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

వంగర: పంట పొలాల్లో పొటాష్ వినియోగం తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా జిల్లేడు ద్రావణాన్ని వినియోగిస్తే మంచి ఫలితం ఇస్తుందని మరువాడ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ అర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని మరువాడ గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లేడు ఆకులు, నీరు, ఆవుమూత్రం వంటివి వాటితో జిల్లేడు ద్రావణం తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వేమిరెడ్డి పోలినాయుడు, కృషి సఖి సభ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి



బొబ్బిలి: వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

తెర్లాం: ఆశ కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ డే మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే కోల్‌కతా ఘటనలోని నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

బొబ్బిలి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి గుల్ల సంతోషికి ఆశ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. పనిభారం తగ్గించాలని, సెలవులు సులభంగా మంజూరయ్యేలా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు ఎల్.శాంతమ్మ, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని సీఐటీయూ నాయకుడు పి.విశ్వనాథం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండలంలోని పొగిరి పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలతో కలిసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచడంతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.భార్గవికి వినతిపత్రం అందించారు.

వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవాలి



రామభద్రపురం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఐవో అచ్యుతకుమారి

రామభద్రపురం: అప్పుడే పుట్టిన శిశువు దగ్గర నుంచి 60 ఏళ్ల వయసు పైబడిన వృద్ధుల వరకు అందరూ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలని డీఐవో డాక్టర్ అచ్యుతకుమారి సూచించారు. మండలంలోని రామభద్రపురం, ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె.. అక్కడి వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి వ్యాధి నిరోధక టీకాల నిర్వహణను పరిశీలించాలన్నారు. జిల్లాలో 95 శాతం పైబడి వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జి శిరీష, రత్నదీపక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తెర్లాం: నెమలాంలో వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారులు మనోజ్ఞ, శ్రీనివాసరావు



రేగిడి: గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

తెర్లాం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండలంలోని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మనోజ్ఞ, శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని నెమలాం గ్రామంలో వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారికి సదరు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిరోజూ కాచివడపోసిన నీటిని తాగాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తినా గ్రామంలో ఉన్న హెల్త్ క్లినిక్‌కు వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరుబయట పదార్థాలు తినకూడదని, కొంచెం వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలన్నారు. కాచివడపోసిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని రేగిడి, ఆమదాలవలస, వన్నలి, సోమరాజుపేట తదితర గ్రామాల్లో రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు మంగళవారం పర్యటించి, ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వెంటనే వారు ఆస్పత్రికి వెళ్లేలా చూడాలన్నారు. అలాగే గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, వ్యాధి బారినపడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాజాం: మండలంలోని ఆగూరు, కంచరాం, దోసరి తదితర గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. తొలుత రికార్డులు పరిశీలించి, అక్కడి పారిశుధ్య పరిస్థితులపై ఆరాతీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.

సురక్షితమైన తాగునీరు అందించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శంకరరావు

బొబ్బిలి: పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయం ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం పట్టణవాసులకు వీధి కుళాయిల ద్వారా మున్సిపల్ అధికారులు అందిస్తున్న తాగునీటి స్వచ్ఛతపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి రక్షిత మంచినీటి పథకాల ట్యాంకుల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టకుండా, ఒక్క క్లోరినేషన్ చేసి, సరఫరా చేసినంత మాత్రాన అది మంచినీరేనని ఎలా అనుకోవాలని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయాల్సి ఉన్నా చాలా ఏళ్లుగా అది సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. ఇంటిపన్ను, నీటిపన్నులను ముక్కు పిండిమరీ వసూలు చేస్తున్నారే తప్ప పట్టణవాసుల ఆరోగ్యాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పట్టణంలో పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా అపారిశుధ్యం పెరిగి, వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. మున్సిపాలిటీలో సరిపడ పారిశుధ్య సిబ్బంది ఉండి, తద్వారా పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. ఆయన వెంట జి.గౌరి, బి.వెంకట్, శివ, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

బొబ్బిలి: నిత్యవసర సరుకులు(నిత్యావసరాలు) ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు తాడంగి ఎండుదొర, కొలుసు సత్యనారాయణ, వై.బాబ్జీ మంగళవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని, పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు తగ్గించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులు అందించాల్సి ఉండగా, కేవలం నాసిరకమైన రెండు నిత్యవసర సరుకులనే అందించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. ప్రస్తుతం విపరీతంగా పెరిగిన నిత్యవసర



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

సరుకుల ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారని, రూ.500 పట్టుకుని వెళ్తే సంచి నిండా సరుకులు కూడా రావడం లేదని వాపోతున్నారన్నారు. ధరలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. మండలంలోని రెడ్డిపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా తగ్గిన అడవుల శాతం కారణంగా ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని, భవిష్యత్ తరాలు బాగుండాలంటే మనమంతా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.



అవగాహన ర్యాలీలో ఎంపీడీవో శ్యామలాకుమారి, తదితరులు

కార్యక్రమంలో ఏపీవో ఎస్.హరనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూకాలమ్మ, శశికళ, అమ్మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సంతకవిటి: అంతర్జాతీయ భాగవత ఆణిముత్యాలు వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన భాగవత పద్యధారణ పోటీల్లో బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు కొణపల దిల్లేశ్వరరావు(ఎనిమిదో తరగతి), నడగాన ధనలక్ష్మి(ఏడో తరగతి), కొణపల లోహిత్‌కుమార్(ఆరో తరగతి)లు ఆ పోటీలో పాల్గొని, వారు చెప్పమన్న పద్యాలను చూడకుండా ధారణ(అప్పజెప్పారు) చేశారు. ఈ మేరకు ఆ సంస్థ తరపున ఒక్కో విద్యార్థికి రూ.1116 బహుమతిగా అందజేశారు. విద్యార్థులకు భాగవత పద్యాల పఠనం, ధారణలో తర్ఫీదు ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణను మిగతా ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అదపాక దామోదరరావు, లక్ష్మీభాను, సత్యనారాయణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

- విగ్రహాల పంపిణీలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ



బొబ్బిలి: మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికి మట్టి వినాయక ప్రతిమ అందజేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ మురళీకృష్ణ

బొబ్బిలి: వినాయక చవితి పండగలో మట్టి వినాయక విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి భక్త సమాజం ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ మంగళవారం చేపట్టారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణం కలుషితమవుతోందని, రకరకాల రోగాలు ప్రబలుతాయని, జలచర జీవులు చనిపోతాయన్నారు. అందరూ మట్టి విగ్రహాలను ఆరాధించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మికి మట్టి గణేశుని విగ్రహం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ చెలికాని మురళి పాల్గొన్నారు.



రాజాం సిటీ: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న నగరపంచాయతీ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద రాజాం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో 501 మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. మట్టి వినాయక ప్రతిమల వినియోగంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, అందరూ మట్టి విగ్రహాలనే పూజించాలని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు కోరారు. భగీరథ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ అందించిన విగ్రహాలను పంపిణీ చేశామని, వారికి తమ అభినందనలన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రీన్‌బెల్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: పట్టణంలోని అమ్మవారి కాలనీలో ఏఎంసీ ఫౌండేషన్ సమకూర్చిన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. నగరపంచాయతీ కమిషనర్ జె.రామప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని విజ్ఞప్తి చేశారు.